




ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు సిపిఎం నాయకుల ఆధ్వర్యంలోగురువారం ప్రజాశక్తి క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ కొత్త హంగులతో చూపరులను ఆకట్టుకునే విధంగా అందంగా ఉందని ఆయన కొనియాడారు.ప్రజాశక్తి సిబ్బందికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం, సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి చల్ల కొలను మల్లికార్జున రావు, సిపిఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు, రైతు సంఘం మండల కార్యదర్శి పుత్తేటి మల్లికార్జున, ఆవాజ్ మండల కార్యదర్శి ఎస్.కె మునీర్ అహ్మద్, సిపిఎం దామరమడుగు శాఖ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు విరివిగా రుణాలు



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన కార్యాచరణ వివరాలను లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉలుగుతాయని, ఖర్చులు తగ్గి వ్యవసాయం మరింత సులభతరం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, డ్రోన్లు వంటి పరికరాల కొనుగోలుకు అన్ని బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలన్నారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, గ్రూపుల వారీగా అలాగే వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాల కొనుగోలుకు రుణాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రుణాలు అవసరమైన రైతులను గుర్తించి సంబంధిత బ్యాంకులతో సమన్వయం చేయాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, కోళ్ల పరిశ్రమలను ప్రోత్సహించేలా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న రైతుల అవసరాలను ద ష్టిలో పెట్టుకుని దరఖాస్తులను తిరస్కరించకుండా ఎక్కువ మందికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఈనెల 28వ తేదీన వ్యవసాయ యాంత్రీకరణతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు మంజూరు చేస్తున్న రుణాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఖచ్చితమైన డేటాతో సంబంధిత బ్యాంకర్లు సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్, నాబార్డ్ డిడిఎం బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవేణి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, పశుసంవర్ధక శాఖ,మత్స్యశాఖ అధికారులు రమేష్‌నాయక్, శాంతి తదితర శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్ :నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఇతర అధికారులతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి డాక్టర్ పి. నారాయణ ఆలోచనల మేరకు పట్టణ ప్రణాళిక విభాగంలో భవన నిర్మాణ అనుమతులను సరళీకృతం చేశారని, అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా నిరంతరం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు.కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఒక్క టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి, సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి కృషి చేయాలని సూచించారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ పథకాల అమలుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని, ఆయా పథకాల గురించి విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన, ప్రచారం కల్పించాలని సూచించారు. విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరు నిబద్ధత పాటించి టౌన్ ప్లానింగ్ విభాగం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు.బి.పి.ఎస్ పథకానికి అర్హత ఉండి కూడా పథకాన్ని ఇప్పటివరకు సద్వినియోగం చేసుకొని భవన యజమానులను గుర్తించి నగరపాలక సంస్థ పరిధిలోని భవనాలకు బి.పి.ఎస్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు.ప్లానింగ్ కార్యదర్శుల లాగిన్లో ఉన్న ఎల్.ఆర్.ఎస్ పాటర్స్ పరిశీలించి వెంటనే తదుపరి అనుమతుల కోసం అధికారులకు పంపాలని ఆదేశించారు.సచివాలయ పరిధిలోని అడ్వర్టైజ్మెంట్ పన్నులు, టెంపరరీ ఎంక్రోచ్మెంట్ పన్నులు గురించి వెంటనే సంబంధిత అధికారులకు నివేదికను అందించవలసిందిగా ఆదేశించారు. ఓపెన్ ఫోరం ద్వారా అందుకున్న 12 వినతులలో 8 విజ్ఞప్తులకు బి.పి.ఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. మరో 4 వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సిటీ ప్లానర్ రఘునాథరావు, టి.పి.ఆర్.ఓ వాసు బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, టి.పి.బి.ఒలు, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



శాలువా, పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సిఎండికి న్యూఇయర్ గ్రీటింగ్స్

ప్రజాశక్తి-నెల్లూరు:

ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సిఎండి, డైరెక్టర్స్, చీఫ్ జనరల్ మేనేజర్స్ కు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ. ఈ.ఈ.లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఇ కె. రాఘవేంద్రం ఆధ్వర్యంలో, జిల్లాలోని అన్ని డివిజన్ ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తిరుపతిలోని ఏపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. నూతన సంవత్సర సందర్భంగా తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఐఏఎస్, డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (ఫైనాన్స్) కె. రామ్మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్ జె.రమణా దేవి ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశం స్నేహపూర్వక వాతా వరణంలో సాగింది. నూతన సంవత్సరంలో సంస్థ మరింత అభివ ద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ అధికారులు తమ శుభాకాంక్షలు తెలిపారు.

'కరెంటోళ్ల జనబాట'కార్యక్రమం



ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా అంతటా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కె. రాఘవేంద్రం ఆధ్వర్యంలో టౌన్ డివిజన్ పరిధిలోని కిసాన్ నగర్ సెక్షన్‌లోని అరుంధతి వాడలో పర్యటించి, అక్కడి వినియోగదారులతో ప్రత్యక్షంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద కూడా సందర్శించి సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భ ంగా జిల్లా సూపరింటెండెంట్ మాట్లాడుతూ, వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యంతో మా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోథేటి శివశంకర్ ఐఏఎస్ కరెంటోళ్ళ జనబాటు కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహించబడుతుందన్నారు. జిల్లా అంతటా అధికారులు, సిబ్బంది ఉదయం 7:30 గంటలకే ఫీల్డ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఫీల్డ్ లెవల్‌లో గుర్తించిన లూజ్ లైన్లు, డామేజ్ అయిన పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకడం, కండక్టర్ డామేజ్ వంటి అన్ని సమస్యలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి తక్షణ పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ పర్యటనలో వినియోగదారుల నుంచి వచ్చిన స్పందనపై వివరాలు సేకరిస్తు న్నామన్నారు. ఈ యాప్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది గమనించిన లోపాలు ఏవైనా ఉంటే వాటిని కార్పొరేట్ ఆఫీస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టౌన్) శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్ కుమార్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఇన్‌ఛార్జ్ మేయర్



ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్ నూతన సంవత్సర సందర్భంగా పురస్కరించుకొని కలెక్టర్ మెజిస్ట్రేట్ హిమాన్షు శుక్లాను శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూ ర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శు



కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్:నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని స్థానిక 5/2, 13/1, 42/1, 50/1 వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించారు.42వ డివిజన్ లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, స్పెషల్ ఆఫీసర్ వాసు బాబు తదితర అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి.నారాయణ ఆదేశాల మేరకు నగర నియోజకవర్గంలో ప్రతి 15 రోజులకోసారి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో మౌలిక వసతులు, రోడ్లు, విద్యుత్, వీధి దీపాల ఏర్పాటు, డ్రెయిన్ల కాలువల నిర్మాణం తదితర అంశాలతో పాటు నూతన పెన్షన్లు, ఇంటి స్థలాలకు పెద్ద ఎత్తున వినతులు వస్తున్నాయని ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ తెలిపారు.మౌలిక వసతుల కల్పన వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలియజేశారు.ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందుకున్న వినతులను అత్యంత పారదర్శకంగా, నిర్దేశించిన సమయంలోపుగా పూర్తి చేసేందుకు స్వయంగా మంత్రి నారాయణే పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబు ల ఆలోచనలతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని నెల్లూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరిముల్లా, నాయకులు ఖలీల్, జాకీర్, మొయినుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

బి.పి.ఎస్ పథకంపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్ :భవనాల యజమానులకు బి.పి.ఎస్ పథకంపై అవగాహన కల్పిస్తూ నగర కమిషనర్ నందన్ కరపత్రాలను పంచి పథకం ఉపయోగాలను వివరించారు.నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక పొగతోట ఎస్ 2 సినిమా హాల్ ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించారు. ప్రతి ఒక్క భవనాన్ని సందర్శించి భవనానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్ కాపీ, ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ లను తనిఖీ చేశారు. అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు బి.పి.ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అన్ని భవనాలను తప్పనిసరిగా తనిఖీలు చేసి అనుమతులు అతిక్రమించిన భవనాలను బి.పి.ఎస్ పరిధిలోకి తీసుకురావాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు అంతా విధిగా తమ పరిధిలోని భవనాలను తనిఖీ చేసి వాటికి నిర్మాణ అనుమతులు, అసెస్మెంట్ డిమాండ్, ట్రేడ్ లైసెన్స్ లను పరిశీలించి అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సైదాపురం:

:మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుభద్ర ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆవిష్కరణలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్‌లో జెండాఊపి ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు



నెల్లూరు నగరంలో జెండాఊపి ప్రారంభిస్తున్న సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.సూర్యనారాయణ

సిఐటియు అఖిల భారత మహాసభలకు పయనం

ప్రజాశక్తి-నెల్లూరు

విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభలకు హాజరయ్యేందుకు సిఐటియు రూరల్, నగర కమిటీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పయనం అయ్యారు. శుక్రవారం ఈ మహాసభలలో పాల్గొనేందుకు సిద్ధమైన వారు రెండు వాహనాల్లో (ఒక ప్రయివేట్ ట్రావెల్ బస్సు, ఒక టెంపో వాహనాల్లో) తరలి వెళ్లారు. ఈ వాహనాలకు మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, నగరంలో పి.సూర్యనారాయణలు జెండాలు ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఎం సుధాకర్ కెపించల నరసయ్య, సిఐటియు నాయకులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు సిఐటి అఖిలభారత 18వ మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో జనవరి 4వ తేదీ విశాఖ మహానగరంలో భారీ ర్యాలీ బహిరంగ సభను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ బహిరంగ సభలో అఖిల భారత మహాసభల సందర్భంగా కార్మికుల శ్రేయస్సు కోసం సిఐటియు చేయాల్సిన పోరాటాలు, ఉద్యమాలకు సంబంధించి నాయకులు తీర్మానాలు చేస్తారన్నారు. సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాసభలు జయప్రదం చేయాలని మహాసభలు కరపత్రాలు, పోస్టర్లు, స్టిక్కర్లు విస్తృతంగా అంటి ంచడం ప్రచారం సైతం నిర్వహించా మన్నారు. అదే విధంగా శ్రామిక ఉత్సవాల పేరుతో కళారూపాలు సైతం నిర్వహించి ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టామన్నారు. శ్రామిక వాడల్లో గ్రూప్ మీటింగ్లు పెట్టి మహాసభల ప్రాధాన్యతను తెలియజేశామన్నారు. ఈ మహాసభల సందర్భ ంగా జరిగే ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడదాం

ప్రజాశక్తి-టిపి గూడూరు

సిఐటియు ఆల్ ఇండియా నాయకత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ మహాసభ తీర్మానం చేయబోతోందని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా పేర్కొన్నారు. సిఐటియు అఖిలభారత 18వ మహాసలు ఈ నెల 4వ తేదీ వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న మహాసభలను పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని నరుకూరులో రాజా మాట్లాడారు. ఈ మహాసభలలో ముఖ్యంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాసభల చివర రోజు ర్యాలీ బహిరంగ సభకు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికులు, ట్రాన్స్పోర్ట్ రంగ కార్మికులు, సిఐటియు కార్మికులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

నక్ష సర్వే కార్యక్రమానికి సహకరించండి

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్



కమిషనర్ నందన్

భారత ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని భూముల వనరుల విభాగం ద్వారా, నగర ప్రాంతాలలో భూముల సర్వేను ఆధు నికంగా, సాంకేతికంగా డిజిటల్ విధానంలో నిర్వహిం చడానికి నక్ష పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని కమిషనర్ వై.ఓ నందన్ కోరారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కమిషనర్ మాట్లాడారు.నక్ష సర్వే నిర్వహణ ద్వారా పట్టణ ప్రణాళిక, అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్ణయాలకు తోడ్పాటును అందించి పౌరుల ఆస్తి రికార్డులు, పన్నులలో పారదర్శకత, సమర్థతలను కలిగి ఉంటుందని వివరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 135 చదరపు కిలోమీటర్ల మేరకు ఉన్న విస్తీర్ణంలో సర్వే జరుగుతోందని తెలిపారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన నక్ష సర్వే నిర్వహణ ద్వారా నగర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ భూములు, ప్రభుత్వ భవనాలు, దేవస్థానాలు, ప్రధాన మార్గాలు, మేజర్ కాలువలు అన్నింటిని నక్ష ప్రాజెక్టు ద్వారా మ్యాపింగ్ చేయనున్నామని తెలిపారు.

నక్ష సర్వే బృందం సర్వే చేసే సమయంలో ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేసి, దానికి సంబంధించిన హద్దులు, ఇతర వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందగలరని సూచించారు. సర్వే పూర్తయిన తర్వాత ఆస్తులకు సంబంధించిన యాజమాన్యపు హక్కు పత్రాలను నక్ష ప్రాజెక్టు ద్వారా యజమానులకు అందించనున్నామని వివరించారు.



పోలీస్ దౌర్జన్యాలను సహించం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్:

వెంకటాచల మండలం, ఇడిమేపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి కార్యకర్త బెల్లంకొండ గురవయ్యను వెంకటాచలం పోలీస్ స్టేషన్లో నిర్బంధించి సిఐ బూతులు తిట్టడం కొట్టడంతో చిత్రహింసలకు గురి చేయడంతో వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి స్థానిక పెన్నా హాస్పిటల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న గురవయ్య ఉన్నాడు. శుక్రవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమిపాలనలో పోలీసులు బరితెగించి అధికార పార్టీ నాయకులకు సలాం కొడుతూ వాళ్ళ దగ్గర గులాం గిరి చేస్తూ ప్రతిపక్షానికి చెందిన వ్యక్తులను హింసించడం క్షమించరాని నేరమన్నారు. వెంకటాచలం సిఐ సుబ్బారావు అధికార పార్టీ నాయకులు కొమ్ము కాస్తూ వారి అడుగులకు మడుగులొత్తుతు తాను అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వైఎస్ఆర్‌సిపి నాయకులను కార్యకర్తలను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

విపిఆర్ సేవలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (వీపీఆర్) చేపడుతున్న కా ర్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని సర్వేపల్లిలోని కంపెనీ ల సహకారంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని సర్వేపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు సోమిరెడ్డి చం ద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్ర వారం మండలంలోని ముంగల దొరువులో వీపీఆర్ ఫౌండేష న్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన వాటర్ ప్లాంటుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లా డుతూ జిల్లాల పునర్విభజనలో నెల్లూరు ప్రయోజనాల ను కాపాడటంలో వేమిరెడ్డి పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తన ఫౌండేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 170కి పైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారన్నారు. ఒక్క వాటర్ ప్లాంట్లే కా దు..జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి లబ్ధి చేకూరేలా అనేక సేవా కార్యక్రమాలు ప్రభాకర్ రెడ్డి ఉదారంగా కొనసా గిస్తున్నారు.ముఖ్యంగా జిల్లా పునర్విభజనలో భాగంగా కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు ఇక్కడ కొనసాగడంతో పాటు గూడూరు రావడంలో వీపీఆర్ పాత్ర కీలకమైందని తెలిపారు. సర్వేపల్లి నియో జకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపట్టిన వీపీఆర్‌కు చంద్రమోహన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కృష్ణపట్నం పోర్టు ఆధారంగా క్రిస్ సిటీ ఏర్పాటవుతోందని చెప్పారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎంపీ వీపీఆర్ తో పాటు బీద రవిచం ద్ర, మంత్రులు, అధికారులు అందరూ సహకరించారన్నా రు. జిల్లా పునర్విభజన విషయంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్ర భాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవి చంద్ర యాదవ్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురే ష్ రెడ్డి, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి కాలువ పరిశీలన


ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్:నెల్లూరు 39 వ డివిజన్ ప్రాంతంలోని రామిరెడ్డి కాలువను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి తనిఖీ చేశారు.ప్రధాన కాలువ ద్వారా మురుగు నీరు ప్రవహించేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అన్ని డ్రెయిను కాలువలలో క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపడుతూ రోడ్లపై వ్యర్థాలు నిల్వ ఉండకుండా సిల్ట్ ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఈ.ఈ రహంతు జానీ, టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథరావు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా పాస్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన పట్టా దారుల పాస్ పుస్తకాలను తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు అందజేశారు. మండలంలోని మినగల్లు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2నుండి 9 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమం మొదటి రోజు మినగల్లుగ్రామంలో నిర్వహించామన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు ప్రభుత్వ ఆదేశానుసారం సాగు చేసుకుంటున్నా వారికి త్వరలోనే పట్టాలను అందజేస్తామని వెల్లడించారు. మండలంలో 4 731 పట్టాదారులకు పాస్ పుస్తకాలను అందజేయాలన్నారు. ఇందులో భాగంగా మినగల్లు గ్రామంలో 378 పాస్ పుస్తకాలను పట్టాదారులకు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొర్రు పూజిత, వ్యవసాయ అధికారి శ్రీహరి, గ్రామ నాయకులు సురేష్ రెడ్డి, శశి రెడ్డి, బొర్రు రాము, అమర్నాథరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైదాపురంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-సైదాపురం:ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ ను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యాప్తంగా 278కి పైగా అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్లో వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. లేదంటే ఆ సమస్యపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదే అని తెలిపారు. అనంతరం జోగిపల్లి, సముద్రాల కండ్రిగ, గ్రామానికి చెందిన రైతులకు పట్టాల పంపిణీ చేశారు. మిగిలిన గ్రామాల్లో త్వరలోనే అధికారుల ద్వారా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ రామ్మోహన్ రెడ్డి, మండల స్థాయి అధికారులు మండల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు పిఏసియస్ అధ్యక్షులు జెడ్పిటిసి సభ్యులు, మండలంలోని అన్ని గ్రామాల కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కురుగొండ్ల

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతిఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించాలని ఆత్మకూరు సిఐ జి.గంగాధర్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్‌టిసి డిపోలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు సిఐ జి.గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో డ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, సీట్ బెల్ట్ వేసుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని రోడ్డుపై పాదచారులను వాహనదారులను గమనించి బస్సులను జాగ్రత్తగా నడపాలని, డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎం.శివకేష్ యాదవ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

టిడిపి నేత మృతికి నివాళులు



ప్రజాశక్తి-కావలి

టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్ సతీమణి మక్బుల్ జాన్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ విషాదకర విషయం తెలుసుకున్న కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి కావలి పట్టణంలోని 10వ వార్డులో ఉన్న షేక్ మస్తాన్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ మస్తాన్ సతీమణి మక్బుల్ జాన్ మృతదేహానికి ఎంఎల్ఎ కృష్ణారెడ్డి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంఎల్ఎను చూసిన వెంటనే భావోద్వేగానికి లోనైన షేక్ మస్తాన్ కన్నీరు పెట్టుకున్నారు. ఆ సమయంలో ఎంఎల్ఎ కృష్ణారెడ్డి మస్తాన్‌ను దగ్గరకు తీసుకొని ధైర్యం చెబుతూ "ఈ కష్ట సమయంలో మీరు ఒంటరి వారు కారని, పార్టీ, తాను ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటాం" అంటూ ఓదార్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మక్బుల్ జాన్ మృతి తీరని లోటు అని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ఎంఎల్ఎ కృష్ణారెడ్డి పరామర్శ, మాటలు షేక్ మస్తాన్ కుటుంబానికి కొంత ఊరటనిచ్చాయని అక్కడున్న వారు భావోద్వేగంతో తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు షేక్ అల్లాబేగం, టిడిపి సీనియర్ నాయకులు, ఆత్మకూరు నాగరాజు, మేడికొండ సుకుమార్,దావులూరి దేవకుమార్, వల్లెరి వెంకటకిరణ్, షేక్ అలహర్, సయ్యద్ ఆఫీజ, దావులూరి దేవకుమార్, షేక్ అల్లర్, షేక్ హజరత్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మర్రిపాడు



స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఏపి ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లు డైరీలు, స్టిక్కర్లు, సిలబ్ బుక్స్‌ను ఎంఇఒలు తిరుపతయ్య, ధనలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఏపి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పాలా రవీంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి జంపాల మాలకొండయ్య, గౌరవ అధ్యక్షులు మంద బ్రహ్మారెడ్డి, సహ ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రమణయ్య, వై వెంకట్, సుబ్బయ్య, జిల్లా కార్యకర్త ఎం.రమేష్, సీనియర్ కార్యకర్తలు బాలాజీ, మల్లికార్జున, రాఘవేంద్ర, హరినాథ్, చేతన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు టిడిపి నాయకుల శుభాకాంక్షలు



ప్రజాశక్తి-బిట్రగుంట

నూతన సంవత్సర సందర్భంగా శుక్రవారం కావలి టిడిపి కార్యాలయలో కావలి శాసనసభ్యులు దగ్గమాటి వెంకటకృష్ణారెడ్డిని బోగోలు పంచాయితీ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు థామస్ పాట్రిక్, టిడిపి సీనియర్ నాయకులు దేవరాల తిరుపతి యాదవ్, కొల్లు రవీంద్ర, బోగోలు పంచాయతీ మాజీ సభ్యురాలు, మొలతాటి పార్వతి కలిసి ఎంఎల్ఎను శాలువాతో సత్కరించి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బోగోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి..

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

6వ తేదీ నుండి జరిగే గ్రామ సమస్యల పరిష్కార వేదికను మహిమలూరు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు తహశీల్దార్ పద్మజాకుమారి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ, ఇతర సమస్యల శాశ్వత పరిష్కారం కోసం డిసెంబర్ 2025 మాసం నుండి ప్రతినెలా ఒక గ్రామంలో నాలుగు పర్యాయాలు సందర్శించి వన్ మంత్ - వన్ విలేజ్- ఫోర్ విజిట్స్ పేరుతో ఆ గ్రామాలలో ఉన్న రెవెన్యూ, ఇతర సమస్యలపై సమీక్ష జరిపి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి ప్రతిఘటన పరిష్కారం కోసం పరిష్కారం కోసం ప్రజల ముంగిటకే యంత్రాంగాన్ని తీసుకువెళ్లాలని తలపెట్టిన ఈ నూతన బృహత్తర కార్యక్రమం. ఆత్మకూరు మండలంలోని మహిమలూరు గ్రామంలో 6, 12, 20, 27వ తేదీలలో ఉదయం 10.30 గంటలకు మండలస్థాయి అధికారులతో నిర్వహించే గ్రామ సమస్యలు పరిష్కార వేదికను ప్రజలందరూ పాల్గొని భూ, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని తద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం మార్గం చూపగలమని, ఈ అవకాశాన్ని గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు తహశీల్దార్ పద్మజాకుమారి ప్రకటన ద్వారా తెలియజేశారు.



ఎంఎల్ఎకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కావలి : కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం పండగ వాతావరణం నెలకొంది. నూతన సంవత్సర సందర్భంగా కావలి టిడిపి కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంఎల్ఎ కృష్ణారెడ్డిని శాలవతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. కావలి నియోజకవర్గంలో ఉన్న వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంఎల్ఎకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజక వర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంఎల్ఎ నాయకత్వాన్ని కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరం కావలి నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదాలతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, ప్రతి కార్యకర్త, నాయ కుడు, అధికారి సహకారంతో కావలిని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

రోడ్డుపై మురుగునీరు



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేట దర్గా సెంటర్లోని ఒకటో గేటు నుంచి రెండో గేటుకు మధ్య మురుగు నీరు రోడ్డుపైన పారుతూ ఉందని సైడ్ కాలువలను బాగు చేయాలని పత్రికాముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దర్గా ప్రాంతంలో శుక్రవారం రోజు భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకొనుటకు అదేవిధంగా ఈ ప్రాంతంలో ఎక్కువగా రద్దీ ఉంటుందని, ఈ పరిస్థితుల్లో ఇక్కడకు వచ్చిన భక్తులు, గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలియజేశారు. కావున ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు, మండల అధికారులు, నాయకులు గుర్తించి దర్గా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

అంగన్‌వాడీలకు ఫోన్లు అందజేత

ప్రజాశక్తి-కావలి

అంగన్‌వాడీ టీచర్ల సేవలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ మరో కీలక నిర్ణయం తీసుకుంది. కావలి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ టీచర్లు, సూపర్వైజర్లకు శుక్రవారం కావలి టిడిపి కార్యాలయంలో 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఒ సౌజన్య, అంగన్‌వాడీలు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా సుమారు 350మంది అంగన్‌వాడీ టీచర్లు, సూపర్వైజర్లకు 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పాత ఫోన్లలో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని పూర్తిగా అధిగమించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 5జీ స్మార్ట్ ఫోన్లు అంగన్‌వాడీ సేవలను మరింత వేగవంతం చేస్తాయని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో అమలవుతోందని ఎంఎల్ఎ తెలిపారు. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, అంగన్‌వాడీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ టీచర్ల గురించి ప్రత్యేకంగా మాట్లాడిన ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి, "గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్య విషయంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర అనిర్వచనీయమైనదన్నారు. ప్రభుత్వ పథకాలకు వారే పునాది. ఎండా.. వానా.. అనే తేడా లేకుండా సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్ల కృషి అమూల్యమైనది" అని కొనియాడారు. 5జీ స్మార్ట్ ఫోన్ల ద్వారా హాజరు నమోదు, డేటా అప్‌డేట్, ప్రభుత్వ ఆదేశాల తక్షణ అమలు, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడం సులభమవుతుందన్నారు. ఇది అంగన్‌వాడీ టీచర్ల పని భారాన్ని తగ్గించి, సేవల నాణ్యతను పెంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి, ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం అంగన్‌వాడీ వ్యవస్థలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, తమ సేవలకు మరింత బలం చేకూరిందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సౌజన్య, అంగన్‌వాడి అధికారులు, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అంగన్‌వాడీ అధికారులు


'ప్రజాశక్తి' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజల పక్షాన 'ప్రజాశక్తి' పత్రిక

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రతి అక్షరమును ప్రజల కోసం రాసే పత్రికగా ప్రజాశక్తి నిలిచిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి పక్షాన నిలిచి వార్తలను సేకరించి ప్రజలకు అందించే దినపత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు సమస్యను తీసుకువెళ్లే దినపత్రిక ప్రజాశక్తి అని ప్రతి కార్మిక కార్మిక నాయకుల సమస్యలతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమాచారం అందించడంలో ప్రజాశక్తి కృషి ఎంతగానో ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, నారాయణ, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.


క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు జ్యోతి, సాయిప్రసాద్

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో యుటిఎఫ్ మండల శాఖకు సంబంధించిన యుటిఎఫ్ 2026 క్యాలెండర్, డైరీని ఎంఇఒలు ఎం.జ్యోతి, డి.సాయిప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యు.మల్లికార్జునరావు, జిల్లా కౌన్సిలర్ జి.సుబ్బయ్య, ఖాజా రహమతుల్లా, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎస్‌డి ఫయాజ్ అలీ, ప్రధాన కార్యదర్శి జి.వెంకటరాజా, ట్రెజరర్ జి.రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను శుక్రవారం తహశీల్దార్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మెడ కృష్ణారెడ్డి, విఆర్‌ఒలు భారతి, పెంచలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మలిశెట్టి

ఎంఎల్ఎకు 'మలిశెట్టి' శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కావలి

నూతన సంవత్సరం 2026 పురస్కరించుకొని కావలి టిడిపి కార్యాలయంలో కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డిని రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కావలి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి నాయకత్వం ప్రశంసనీయమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే విధంగా పని చేస్తూ టిడిపి బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లక్ష్మీనరసింహస్వామి ఆధ్వర్యంలో జనవరి 2026 నూతన సంవత్సర వేడుకలను భారీ కేక్ కట్ చేసి, మండల ఆరోగ్య సిబ్బందితో కలిసి న్యూ ఇయర్ వేడుకలను సెలబ్రేషన్ చేసుకున్నారు. అనంతరం ప్రజాశక్తి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రజాశక్తి విలేకరి జల్లి. శ్రీనివాసులు డాక్టర్లతో ఆవిష్కరింప చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐ జమాల్‌వలీకి సత్కారం

ప్రజాశక్తి-కావలి


సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

డిసెంబర్ నెలాఖరున ఒకటో పట్టణ ఎస్.ఐ.గా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా పి.జమాల్ వలీకి, కావలి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జమాల్ వలీని వారి స్వగృహంలో శుక్రవారం ఆత్మీయంగా కలుసుకొని, దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు, శుభాభి నందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మాట్లాడుతూ జమాల్ వలీ మంచి క్రీడాకారులు, సేవాతత్పరులు, పోలీస్ డిపార్ట్మెంట్‌లో 43సంవత్సరాలు సుదీర్ఘకాలం, క్రమశిక్షణ, అంకిత భావం రెండుకళ్ళుగా, భావించి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, పోలీస్ ఉన్నత అధికారుల, మన్ననలు, ప్రశంసలు పొంది, సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా, కావలి 1 టౌన్‌లో విధులు నిర్వహిస్తూ, ఉద్యోగ విరమణ చేయడం చాలా సంతోషకర విషయమని, అభినందనీయమని తెలియజేశారు. తమ స్వచ్ఛంద సంస్థలకు ఇక నుండి జమాల్ వలీ వారి ఆత్మీయ సహకారం తమకు అందించాలని కోరుకుంటూ వారిని, సత్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు షేక్ బాషా, మీకోసం సేవా సంస్థ రాయపాటి దిలీప్ కుమార్, రత్నమ్మ ఫౌండేషన్ ఎం.వి.ఎన్. ప్రసాద్ రావు, హ్యాపీ సేవాసంస్థ సయ్యద్ ఘని బాషా, టైం టు హెల్ప్ ట్రస్ట్, నందిపాటి రమేష్, బి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ షేక్.రఫీ అహమ్మద్, జాగో సేవాసంస్థ షేక్. జమీర్, లోక్‌సత్తా ఎం.మాలకొండా రెడ్డి, సామాజిక సేవకులు, చేవూరు ప్రభాకర్, విశ్రాంత లైబ్రరీన్, సయద్.మహబూబ్ బాష, దేవరకొండవిజయ్, హాజరత్తయ్య, బాబ్జీ, అమీర్ ఖాన్, నౌషాద్ అలీ, నజీర్, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అందువల్ల వాహనం నడిపే సమయంలో దృఢమైన, ప్రశాంతమైన మానసిక స్థితి కలిగి ఉండాలని, తద్వారా రహదారి ప్రమాదాలు కలుగకుండా జాగ్రత్త వహించాలని సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పి.శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో గ్యారేజీలో 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను డిఎస్‌పి పి.శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్‌టిసిలో డ్రైవర్లకు తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రమాదాలు తక్కువన్నారు. ఇంటి సమస్యలు, ఇంటిలోనే వదిలి వేయాలని, బస్సు నడిపే సమయంలో డ్రైవింగ్ పైనే దృష్టి సారించాలని అన్నారు. ప్రతీ డ్రైవర్ 30 నిమిషాలు ధ్యానం చేయాలని, అందువల్ల మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ పి.మురళీధర్ మాట్లాడుతూ బస్సు నడిపే సమయంలో తన చేతిలో మరో 50కి పైగా ప్రాణాలు ఉన్నాయని ఆలోచించాలన్నారు. ఎదుటివారి తప్పు వల్ల కూడా ప్రమాదం జరుగ వచ్చనే అప్రమత్తత కూడా అవసరమన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుందరరావు మాట్లాడుతూ బస్సు నడిపే సమయంలో సెల్ ఫోన్లో మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రమాద రహిత డ్రైవింగ్ కొరకు డ్రైవర్లకు తరచూ శిక్షణ, కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని నెల రోజుల పాటు నిర్వహించబోయే కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాయి, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) బి.మల్లికార్జున మాట్లాడారు. అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.


మాసోత్సవాల ప్రారంభోత్సవం చేస్తున్న అధికారులు


ఘటన స్థలంలో సిఐ సుధాకర్‌రెడ్డి

జాతీయ రహదారిపై ప్రమాదం

- గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించిన సిఐ

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు జాతీయ రహదారి పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దంపతులు తీవ్రంగా గాయపడిన విషయం గుర్తించిన కోవూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ రెడ్డి తక్షణమే స్పందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ సుధాకర్ రెడ్డి, అక్కడే ఉండి గాయపడిన వారిని తక్షణమే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. బాధితులకు మెరుగైన చికిత్స అందేలా హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల పట్టాదార్ పాస్‌బుక్‌లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి



రైతన్న ప్రభుత్వంలో రైతు ఇబ్బందులు వెదురుకోకుండా వారి అవసరాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన రాజ్యముద్ర పట్టాదారు పాసుబుక్‌లను పంపిణీ చేసినట్లు మండల టిడిపి అధ్యక్షులు చింతనబోయిన బయన్న యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆర్లపడియ పంచాయతీలో మొదటి రోజు తహశీల్దార్ ఎల్.రామ్మోహన్ అధ్యక్షతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శాసనసభ్యులు కాకర్ల సురేష్ సూచనలతో పంచాయతీ రైతులకు రాజముద్ర ముద్రించిన పట్టాదారు పాసుబుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర రైతాంగ గుర్తించి రైతులు మరింతగా ఉపయోగపడే విధంగా గతంలో మాజీ ముఖ్యమంత్రి చిత్రపటంతో ముద్రించిన పట్టాదారు పాసుబుక్కులను తొలగించి నూతనంగా రాజముద్రను ముద్రించిన పట్టాదారు పాస్‌బుక్‌లను అందజేస్తున్నామన్నారు. వీటి ద్వారా రైతులు బ్యాంకు రుణాలు వివిధ రైతు అవసరాలకు వీటిని ఉపయోగించుకోవచ్చని రైతులు ఇకనుండి ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉండబోవని వివరించారు. రీ సర్వే అయిన ప్రతి పంచాయతీలో ప్రభుత్వం అందజేస్తున్న ఈ పట్టాదారు పాస్‌బుక్కులను ప్రతి రైతుకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వాడకప్పు మాలాద్రి, కృష్ణారెడ్డి, విఆర్‌ఒలు చెన్న కృష్ణయ్య, మస్తాన్, నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట :



బోగోలు మండలం జక్కపల్లి గూడూరు పరిధిలోని సోమేశ్వర పురం గ్రామంలో పట్టాదారుని భూమి పాస్‌బుక్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ఎస్ వి పి ఎం డి, 1 అధ్యక్షులు యర్రం వెంకటేశ్వర్ రెడ్డి, కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాలే పార్టీ నాగేశ్వరరావు మాట్లాడుతూ బోగోలు మండలంలో పరిధిలో ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే పూర్తయిన మొత్తం ఏడు గ్రామాల్లో 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు రైతులకు పట్టాదారుని పాస్ బుక్ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు కాంద్ర రఘురాం నాయుడు, రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సంగంలో..

ప్రజాశక్తి-సంగం : మండలంలోని జంగాల కండ్రిక గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తహశీల్దార్ సోమ్లా నాయక్, గ్రామ సర్పంచ్ సునీల్, టిడిపి నాయకులతో కలిసి రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు. రైతుల భూములకు సంబంధించిన అప్‌డేటెడ్ రికార్డులు ప్రభుత్వ డేటాబేస్‌లో సమగ్రంగా నమోదు చేయబడిన అనంతరం నూతన పాసు పుస్తకాలు జారీ చేయబడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో పడమటిపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులు గంగపట్నం చంద్రశేఖరయ్య, సంగం సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, సొసైటీ డైరెక్టర్ పిట్టు పట్టాభిరామిరెడ్డి, మర్రిపాడు ఆలయ చైర్మన్ హరిరెడ్డి, మోహన్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట :



మండలంలో హసనాపురం గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. తహశీల్దార్ అనిల్ కుమార్ టిడిపి మండల కన్వీనర్ రమేష్ నాయుడుతో కలిసి ఈ పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రీ సర్వే ప్రకారం రైతులకు వారి భూమి సంబంధించిన 179 పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు, అదేవిధంగా కూనలమ్మపాడు గ్రామంలో రైతులకు సంబంధించి రీ సర్వే అయిందని, 105 పాస్‌పుస్తకాలు (నేడు) శనివారం పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే ఈ గ్రామాలలో ఇతర రెవెన్యూ సమస్యల గురించి గ్రామస్తులతో చర్చించారు.


పంటల సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

రైతులకు పంటల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండలంలో సమగ్ర పంటల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తూ, రైతులకు అవసరమైన పంటల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కోవూరు వ్యవసాయ అధికారి అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు కింది సామాగ్రి అందజేశారు. సూర్య కాంతితో పనిచేసే దీపాలు, పురుగులను పట్టుకునే ఉచ్చులు, ట్రైకో విత్తన పదార్థం, గ్రామ కాడులు, వేప పిండి, జింకు ఎరువు, జీవ ఎరువులు నేల ఉరుకుదనానికి ఉపయోగపడేవి ఈ సామాగ్రి వాడకం వల్ల పురుగుల నియంత్రణ, పంటల సంరక్షణ, దిగుబడి పెంపు వంటి ప్రయోజనాలు ఎలా కలుగుతాయో అభిత రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో న్యూఇయర్ వేడుకలు

ప్రజాశక్తి-కావలి



మండలంలోని సర్వాయిపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు తోట. వెంకటేశ్వర్లును ఆ పాఠశాల సిబ్బంది శాలువా, పండ్లు పూలమాలలతో ఘనంగా సత్కరించి, ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు - 2026ను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తోట.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "పాఠశాల దేవాలయం లాంటిదని" పాఠశాల సిబ్బంది ఇప్పటి వరకు పరిపాలన విషయంలోగాని, అకడమిక్ విషయంలోగానీ పాఠశాల అంతర్గత విషయంలో గానీ తనకు ఎంతో సహాయ సహకారాలు అందించారని, మున్ముందు వారి సహాయ సహకారాలు అదేవిధంగా కొనసాగాలని ఆకాంక్షించారు. గత విద్యా సంవత్సరం (2024-25)లో పదవ తరగతి ఫలితాలలో 600 మార్కులకుగానూ 592 మార్కులు సాధించి, అదేవిధంగా 500 పైచిలుకు మార్కులతో 19మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఈ విద్యా సంవత్సరం (2025-26) కూడా ఉపాధ్యాయుల సహాయసహకారాలతో ఇంకా మెరుగైన ఫలితాలను సాధించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.